# నిజాయితీ... నీవె(వి)క్కడ?

- ఎం.సి. ఆంజనేయులు

మద్యపాన నిషేధం కొన్నేళ్ళుగా అమలులో వున్నా - ఆ పట్టణ శివార్లలో బాహాటంగా బార్లు నడుపుతున్నారని, కొన్ని సందు-గొందుల్లో కల్లూ-సారా దుకాణాలు రోజురోజుకీ ఎక్కువవుతున్నాయని ఆ శాఖాధిపతి దృష్టికి వచ్చింది.

ఇక ఉపేక్షిస్తే లాభం లేదని, ఆ పట్టణంలోని అధికారిని బదిలీచేసి, ఆయన స్థానంలో, డిపార్ట్‌మెంటులో 'చండశాసనుడు'గా పేరున్న పి.కె. రావుని నియమించి, వెంటనే వెళ్ళి చార్జి తీసుకోమని ఆజ్ఞలు జారీచేశాడు శాఖాధిపతి.

ఆర్డరు అందుకున్న అయిదు గంటల లోపలే - ఏకాఏకి సదరు పట్టణం చేరుకొని, చార్జి తీసికొని, తన కింది ఆఫీసర్లని పిలిపించాడు పి.కె. రావు.

"ఛీ... ఛీ... సిగ్గుచేటు. మీ లాంటి అప్రయోజకులుండబట్టే మన డిపార్ట్‌మెంటు కీనాడు ఇంత చెడ్డపేరొచ్చింది. ఇంతమంది - ఇంతమంది ఆఫీసర్లు వున్నారు! ఏడవనా? పదిరోజులు గడువిస్తున్నాను - కనీసం పదికేసులయినా బుక్ చేయండి. లేకుంటే మీ ఉద్యోగాలకి గ్యారంటీ ఇవ్వలేను. మరో విషయం - మీరు సోదాలకూ, గాలింపులకు వెళ్ళినప్పుడు నేనిక్కడ తిని తొంగుంటానని అనుకోకండి. ప్రతిక్షణం - మీ ప్రతి కదలికను నేను గమనిస్తూనే వుంటాను. నా ఫీడ్‌బాక్ నాకుంది. మీ పై వున్న ఈ అపప్రథ తొలగించుకోండి. ఊఁ వెళ్ళండి." దులిపేశాడు పి.కె. రావు.

మొదటిరోజు - ఒక్క కేసూ రాలేదు. రెండు, మూడు, నాల్గు... ఇలా రోజులు గడిచిపోతూనే వున్నాయి.

అప్పటికి వారం రోజులయింది, పి.కె. రావు ఆ వూరొచ్చి. బార్లు నడుస్తూనే వున్నాయి. బీర్లు, విస్కీలు సేవించేవారు సేవిస్తూనే వున్నారు. కల్లూ-సారాలు తాగిన జనం రోడ్లమీద అక్కడక్కడా దొర్లుతూనే వున్నారు.

ఒక్క కేసయినా-నమోదు కాలేదు.

కోపోద్రేకుడయిపోయాడు పి.కె. రావు. ఇన్‌స్పెక్టర్స్‌ని వెంటనే వచ్చి కల్సుకోమంటూ కబురెట్టాడు. బ్లాక్‌మార్క్, ఇంక్రిమెంట్ కట్, సస్పెన్షన్, డిస్మిస్ వంటి 'భయానక' పదజాలాన్ని విరివిగా ఉపయోగించి, తిట్టిన తిట్టు తిట్టకుండా అందరినీ డ్రెస్‌డౌన్ చేసి వదిలేశాడు.

ముఖాలు గంట్లు పెట్టుకొని బయటపడ్డారు ఇన్‌స్పెక్టర్స్.

ఇచ్చిన పది రోజుల గడువూ రేపటితో ముగుస్తుంది.

తొమ్మిదోరోజు సాయంత్రం నగర శివార్లలోని ఆ నది ఒడ్డున ఓ పెద్దగుడారం. అందులోంచి మంద్ర స్వరాన పాప్ మ్యూజిక్ వినిపిస్తోంది. మ్యూజిక్‌కి అనుగుణంగా నృత్యవు చిరుగజ్జెలమోత. మందు బాబుల అరుపులు - తప్పెట్లూ - తాళాలు.

గుడారాన్ని సిబ్బందితో చుట్టుముట్టిన ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ - విజిల్ ఊదడం - పదిమంది సిబ్బందీ ఒక్క వుదుటున లోపల ప్రవేశించడం ఒకేమారు జరిగిపోయింది.

"హుఁ ఎవ్వరూ కదలకండి. కదిలారా... కాల్చిపారేస్తాను." ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ గావుకేక.

లైట్లు ఆరిపోయాయ్. అంతటా - తొక్కిసలాటలు... ఏడ్పుల్లాంటి కేకలు.

"నేను సూపర్నెంట్ పి.కె. రావుని! నన్ను పట్టుకున్న ఇడియట్ ఎవరు!?"

లైట్లు వెలిగాయ్. వెలిగిన దీపాల కాంతిలో తను బంధించిన బాసుని చూచి, ప్రతాప్ ముఖంలో వెలుగు ఆరిపోయింది.

"సర్! తప్పయిపోయింది. మీరనుకోలేదు. సారీ."

"సారీ ఎందుకయ్యా! నిన్ను కంగ్రాట్ చేస్తున్నాను. ఊ.. ఇక్కడున్న అందర్నీ రౌండప్ చేయ్ - ఒక్కర్నీ వదలకుండా" అన్నాడు, పి.కె. రావు. ○